# హాయ్ హేండ్సమ్

"హాయ్ సుబ్బూ! ఇవాళ ఆఫీసు నించి తొందరగా వచ్చేశాను. సినిమాకి వెళ్దామా?" అంటూ సుబ్బలక్ష్మి భుజంమీద చెయ్యేశాడు సుబ్బారావు.

విసురుగా సుబ్బారావు చేతిని నెట్టేసింది సుబ్బలక్ష్మి.

"ఏమైంది సుబ్బూ? ఎందుకంత కోపంగా ఉన్నావు?"

"పొద్దున్న దాన్నెందుకు కొనుక్కొచ్చారు మీరు?"

"దేన్ని?"

"కొనుక్కొచ్చి నాకు కనిపించకుండా దాచిపెట్టింది కాక ఏమీ తెలియనట్టు అడుగుతున్నారా? అసలు అది వాడాలని మీ కెందుకనిపించింది?"

"నిజంగా నాకు గుర్తు రావట్లేదే. అసలు విషయమేంటో చెప్తే నీ అనుమానాలన్నిటికీ సమాధానం చెప్తాను."

"అదే, మగాళ్ళు మొహానికి రాసుకునే పేస్టు. టీవీలో చూపిస్తున్నారు కదా. అది."

సుబ్బలక్ష్మి మాటలకి గట్టిగా నవ్వాడు సుబ్బారావు.

"ఎందుకా నవ్వు? నేనింత బాధపడుతుంటే మీకు నవ్వులాటలాగా వుందా?"

"దాన్ని పేస్టు అనరు. ఫెయిర్‌నెస్ క్రీమ్ అంటారు."

"ఆఁ! తెలుసులెండి."

"నీకు కనిపించకుండా దాచిపెడ్తే నాకేం ఒరుగుతుంది. పొద్దున్న కొనుక్కొచ్చి ఆఫీసుకెళ్ళే హడావుడిలో అట్లా పెట్టేశాను. ఎక్కడ పెట్టానో నాకే గుర్తులేదు. అయినా నేను ఫెయిర్‌నెస్ క్రీమ్ కొనుక్కుంటే నీకు కోపమెందుకు, నేను తెల్లగా అందంగా తయారైతే సంతోషించాల్సింది పోయి?"

"ఇప్పుడు మీరు తెల్లగా, అందంగా తయారుకావడమెందుకో?"

"అదేంటి సుబ్బూ అట్లా అంటావు? ఏ మనిషికైనా అందంగా కనిపించాలన్న కోరిక ఉండడం సహజమే కదా?"

"ఎవరికి అందంగా కనిపించాలి?" లా పాయింటు లాగుతున్నట్టు అడుగుతున్న సుబ్బలక్ష్మిని చూస్తే సుబ్బారావుకి చిరాకేసింది.

"ఎవరికేమిటి? చుట్టూ ఉన్నవాళ్ళందరికి." విసుగ్గా చెప్పాడు.

"చూశారా, నా మీద మీకు విసుగొచ్చేసింది. చుట్టుపక్కల ఉన్న ఆడపిల్లల్నందర్నీ ఆకర్షించడానికి మీరు ఆ క్రీము కొని తెచ్చుకున్నారు."

పాలపర్తి జ్యోతిష్మతి

"అయ్యయ్యో! అవేం మాటలే? నేనటువంటి వాణ్ణి కాదే. నాకటువంటి ఉద్దేశాలు లేవు. నన్నపార్థం చేసుకోకు." కంగారుగా అన్నాడు సుబ్బారావు.

"మరి ఆ క్రీము ఎందుకు తెచ్చుకున్నారు?"

"దానికీ దీనికీ సంబంధమేమిటీ? టీవీలో ప్రకటన చూసి, నల్లగా వుంటాను కదా! ఒకసారి ఎట్లా పనిచేస్తుందో చూద్దామనిపించింది. అంతే."

"అదుగో. చెప్పనే చెప్పేశారు."

"ఏం చెప్పాను?"

"టీవీలో ప్రకటన చూసి అని."

"అవును, చెప్పాను. దాంట్లో తప్పేముంది?"

"తప్పేముందంటున్నారా? ఆ ప్రకటనలో ఆ కుర్రాడు ఆ క్రీము రాసుకోగానే ఆడపిల్లలంతా 'హాయ్ హేండ్సమ్, హాయ్ హేండ్సమ్' అంటూ వాడి మీద పడిపోయి ముద్దులు పెట్టరూ? అట్లాగే ఆడపిల్లలు మీ వెంట పడాలనే కదా మీరు దాన్ని తెచ్చుకున్నారు. నామీద మీకు మోజు తీరిపోయింది." ముక్కుచీది కళ్ళు తుడుచుకుంది సుబ్బలక్ష్మి.

మళ్ళీ గట్టిగా నవ్వాడు సుబ్బారావు. "పిచ్చి సుబ్బూ! మొహాని కేదో పూసుకున్నంత మాత్రాన ఆడపిల్లలు వచ్చి మీద పడిపోతారా? ఇప్పుడూ...ఎవడో ఆ క్రీము పూసుకుని వచ్చాడనుకో. నువ్వు వాడి వెంట పడతావా?"

"ఛీ!ఛీ! ఏం మాటలవి? వినడానికే అసహ్యంగా ఉంది."

"అందరు ఆడపిల్లలూ నీలాంటి వాళ్ళే. ఎవరూ అట్లా చెయ్యరు."

"మరి టీవీలో అట్లా చూపించారెందుకు?"

"అది నటన, అంతే. అట్లా నటించినందుకు

వాళ్ళకి బోలెడు డబ్బిస్తారు."

"డబ్బిస్తే మాత్రం అవేం వేషాలు?" చిరాగ్గా అంది సుబ్బలక్ష్మి.

"వాళ్ళ సంగతి మనకెందుకు? నేను అట్లా ఆలోచించలేదు. నువ్వంటే నాకు ప్రాణం. నన్నుసుమానించకు." బ్రతిమాలుతూ అన్నాడు సుబ్బారావు.

"అంతేనంటారా?" గోముగా అడిగింది సుబ్బలక్ష్మి.

"అంతే సుబ్బూ. ఇంక ఆ విషయం వదిలేసెయ్యి." ఆనందంగా అన్నాడు సుబ్బారావు.

"మరైతే ఆ చెత్త సెల్‌ఫోన్ ఎందుకు కొన్నారు?" మళ్ళీ సుబ్బారావు మీద దాడికి దిగింది సుబ్బలక్ష్మి.

"చెత్త సెల్‌ఫోన్ కాదే. చేతోమొబైల్."

"సెల్‌ఫోన్ అన్నా మొబైల్ అన్నా ఒకటేనని నాకు తెలుసులెండి. ఆ చెత్తది ఎందుకు కొన్నారని అడుగుతున్నాను."

"చెత్తదెందుకయిందే? కొత్తదే కదా నేను కొన్నది."

"అబ్బా! అర్థం కానట్టు నంగనాచి కబుర్లెందుకు? ఆ కంపెనీదే ఎందుకు కొన్నట్టు?" చివరి మాటలు నొక్కి పలుకుతూ అడిగింది సుబ్బలక్ష్మి.

"డబ్బులు తక్కువ అవుతాయి కాబట్టి." సుబ్బారావు కూడా ప్రతి పదాన్నీ నొక్కి పలుకుతూ చెప్పాడు.

"ఏమీ కాదు."

"మరేమిటి?"

"ఆ మొబైల్ ప్రకటనలో ఒకతను ఉబ్బితబ్బిబ్బయిపోతూ ఇద్దరమ్మాయిల మధ్య కూర్చుంటాడు, విమానంలో అనుకుంటా. సిగ్గులేకుండా ఒకమ్మాయి వాడి భుజం మీద తల ఆన్చుకుని మరీ నిద్రపోతుంది. అది చూసే కదా మీరా మొబైల్ కొన్నది?"

"ఆ ప్రకటన చూసే కొన్నాను, కానీ ఆ సెల్‌ఫోన్ నా దగ్గరున్నంత మాత్రాన ప్రయాణాల్లో ఆడపిల్లలు నా పక్కన కూర్చుని నా భుజం మీద తల పెట్టుకుని పడుకుంటారని కాదు. అయినా..."

"నాకు తెలుసు మీరు చెప్పేదేంటో. ఏ రైల్లోనో బస్సుల్లోనో ఎప్పుడైనా మగాళ్ళ పక్కన కూర్చోవలసొస్తే నాకు ముళ్ళ మీదున్నట్టు ఉంటుంది. చాలా జాగ్రత్తగా ఉంటాను. అందరు ఆడపిల్లలూ నాలాంటి వాళ్ళే. ఎవరూ అట్లా ముక్కూ మొహం తెలియని మగాళ్ళ పక్కన కూర్చుని వాడి మీద పడి నిద్రపోరు. ఇదే కదా మీ మనసులో భావం?"

"అంతే! అంతే!"

"మరి ఆ ప్రకటనల్లో అట్లా ఎందుకు చూపిస్తున్నారు? వాళ్ళకి బుద్ధిలేక చూపిస్తే మాత్రం మీరు అవే ఎందుకు కొంటున్నారు?"

"సుబ్బూ! నేను చెప్పేది కాస్త అర్థం చేసుకోవే."

"సరే. మీరు చెప్పదలుచుకున్నది మొత్తం చెప్పండి. వింటాను."

"ఏదైనా ఒక కొత్తవస్తువు తయారు చేసినప్పుడు దాని గురించి అందరికీ తెలియడానికి రకరకాల ప్రకటనలు చేస్తారు. అవి చూసి ఆ వస్తువు కావాలనుకున్న వాళ్ళు కొనుక్కుంటారు. అంతేకానీ అన్నీ ఆ ప్రకటనలో చూపించినట్టే జరగవు."

"అవునా! అయితే ఆ క్రీము రాసుకుంటే తెల్లబడరా? ఆ మొబైల్‌కి ఖర్చు తక్కువ కాదా?"

"అబ్బా, సుబ్బూ! నువ్వు తెలివిగా మాట్లాడుతున్నావో, తెలివి తక్కువగా ఆలోచిస్తున్నావో అర్థం కావట్లేదు." అసహనంగా గొణుక్కున్నాడు సుబ్బారావు.

"ఏమిటంటున్నారు?"

"అ! ఏమీలేదు. నువ్వింత తెలివిగా ప్రశ్నలు వేస్తుంటే నేను సమాధానం చెప్పలేకపోతున్నాను అంటున్నాను."

"నేనెప్పుడూ అంతే" మురిసిపోతూ అంది సుబ్బలక్ష్మి. "సరేలెండి. విషయం పక్కదోవ పడుతోంది. నాకు సమాధానం చెప్పండి."

"చెప్పానుకదా, నీకు నేను సమాధానం చెప్పలేనని. ఆ క్రీము రాసుకుంటే నిజంగా తెల్లబడతారో లేదో నాకు తెలియదు కానీ నేను దాన్ని వాడను." అంటూ ఫెయిర్‌నెస్ క్రీం ట్యూబుని మురిక్కాలవలోకి విసిరేసి "చాలా?" అన్నాడు సుబ్బారావు.

"మరి సెల్‌ఫోన్ సంగతేమిటి?"

"బోలెడు ఖరీదు పెట్టి కొన్నానేదాన్ని. పారేయ్యడానికి చేతులు రావట్లేదు. అవకాశం చూసుకుని సిమ్‌కార్డు మార్చుస్తానే. దయచేసి ఇంక నన్నొదిలిపెట్టు." దణ్ణం పెట్టేశాడు సుబ్బారావు.

విజయగర్వంతో ముసిముసిగా నవ్వుకుంటూ "సరేలెండి. సినిమాకెళ్దాం. తయారవ్వండి. ఈ లోపల కాఫీ తెస్తాను." అంటూ వయ్యారంగా వంటింట్లోకి నడిచింది సుబ్బలక్ష్మి.

## చిటికెన వ్రేలు

కాలనాధభట్ట వీరభద్రశాస్త్రి

అమ్మ చిటికెన వ్రేలు పట్టుకొని
చిన్నతనంలో ఆమెతో వెళ్ళేవాడిని
నన్ను భవిష్యత్‌లోకి నడిపించింది ఆ వ్రేలే
నేనున్నానని ధైర్యం ఇచ్చినదీ ఆ వ్రేలే
నా చిటికెన వ్రేలు పట్టుకొని
అగ్నిహోత్రం చుట్టూ
ఏడడుగులు నాతో నడిచింది
నా సహధర్మచారిణి
కష్టసుఖాలలో పాలుపంచుకొంటూ
చేదోడు వాదోడై మసిలింది

నా చిటికిన వ్రేలు పట్టుకొని
నడిచింది నా చిన్నారి మనుమరాలు
వయస్సు మళ్ళిన నాకు బెస్ట్ ఫ్రెండ్
ఎన్నో కబుర్లు చెప్పింది
కథలు చెప్పమంది
నా దగ్గరే పడుకొంటానని మారాం చేసేది
భర్త చిటికెన వ్రేలు పట్టుకొని
అగ్నిహోత్రం చుట్టూ ఏడడుగులు నడిచి
తీపిగుర్తులు నెమరేసుకోమని అత్తారింటికి
వెళ్ళింది

ఇక నా చిటికిన వ్రేలుకు మిగిలింది
తెల్లరాయి పొదిగిన ఉంగరమొక్కటే
అదైనా సరిగ్గా ఆనడం లేదు
కళ్ళలో నీరు చిమ్మడంతో...